ఆంధ్రజ్యోతి

గరిష్ఠం : 30.5
కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శనివారం 8 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	67,674	67,674
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.604 (45.1540)	55,235	58,800

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.250


హుజూర్‌నగర్ మండలంలో నేలకొరిగిన వరి చేను

కన్నీరే మిగిలింది

పంట చేతికొచ్చే దశలో భారీ వర్షాలు కురియటంతో రైతుకు కన్నీరే మిగిలింది. సూర్యాపేట జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోగా ఆ ప్రభావం నుంచి నేటికీ రైతులు కోలుకోలేక పోతున్నారు. సాధారణంగా ఎకరానికి 30 నుంచి 40 బస్తాల ధాన్యం రావాల్సి ఉండగా 20 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 4.85 లక్షల వరి పంట సాగు చేయగా 54 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పత్తి 92 వేల ఎకరాల్లో సాగు చేయగా 10 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట)

జిల్లాలోని 23 మండలాల్లోని 237 గ్రామాల్లో వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వానాకాలం సీజన్‌లో జూలై, ఆగస్టు నెలలో రైతులు వరి సాగు చేశారు. సెప్టెంబరు వర్షాలు కొంత ముఖం చాటేశాయి. ఇదే సమయంలో కాల్వల్లోకి నీరు రావడంతో పంట కొంత కోలుకుంది. ఆ తర్వాత అక్టోబరులో వర్షాలు భారీగా కురిశాయి. అయితే మొంథా తుపాన్ ప్రభావం నవంబరులో అధికంగా ఉండడంతో వరి పొలాలు కోత సమయంలో వరదలో మునిగి నష్టపోయి పెట్టుబడులు వచ్చే పరిస్థితి కానరావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పత్తి రైతులదీ అదే పరిస్థితి

వరుసగా కురిసిన వర్షాలకు పత్తి పంట భారీగా దెబ్బతింది. జిల్లావ్యాప్తంగా 92వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 10వేల ఎకరాల్లో తీవ్రంగా నష్టం వాటిల్లింది. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పత్తి సాగుకు ఎకరం కౌలుకు తీసుకుంటే రైతుకు రూ.12వేల వరకు ఇస్తారు. వరి ఎకరాకు కౌలు రూ.10వేలు లేదా 6 నుంచి 10బస్తాల ధాన్యం ఇస్తారు. ప్రస్తుతం కౌలు రైతులు పంట చేతికి వచ్చే సమయంలో నష్టపోవడంతో పంటతో పాటు కౌలు చెల్లింపు ఇబ్బందిగా మారింది. వీటితో పాటు పెసర 1,150 ఎకరాల్లో, కంది 2,125, వేరుశెనగ 198 ఎకరాల్లో, మినుములు 45 ఎకరాల్లో సాగుచేశారు. ప్రస్తుతం వర్షంతో 20శాతం పంట నష్టం జరిగింది.

పెట్టుబడి ఎక్కువ, దిగుబడి తక్కువ

వాతావరణం అనుకూలంగా ఉంటే పత్తికి మంచి లాభాలే వస్తాయి. ఎకరానికి రూ.30వేల పెట్టుబడి పెడితే దిగుబడి 10 నుంచి 15క్వింటాల పంట దిగుబడి వస్తుంది. క్వింటా రూ.6 నుంచి రూ.8వేల వరకు పలుకుతోంది. ఈసారి వాతావరణం బాగా లేక పోవడంతో పత్తి..

- మిగతా 8వ పేజీలో...

తడారని పొలాలతో వరికోతలకు ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి-మద్దిరాల): పంట చేతికొచ్చే దశలో వరుసగా వర్షాలు కురవడంతో పొలాల్లో తడి ఆరడం లేదు. మద్దిరాల మండలంలో చాలా ప్రాంతాల్లో వరి నేలకు వాలగా, కోసిన పంట వర్షం పాలైంది. మిగిలిన పంటనైనా దక్కించుకోవాలన్న రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. వాతావరణ చల్లగా ఉండటంతో నేటికీ పొలంలో తడి ఆరలేదు. పొలాల్లో బురదతో గింజలు మొలకెత్తే ప్రమాదం ఉండటంతో వరి కోతల కోసం రైతులు ట్రాక్‌మిషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వరికోత యంత్రాల బ్రోకర్లు ధరలు అమాంతంగా పెంచారు. గంటకు రూ.3వేల నుంచి రూ.3500తీసుకుంటున్నారు. టైర్ల మిషన్‌కు గంటకు రూ.2వేల రూ.2500తీసుకుంటారు. మండలంలో 13,600 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి కోతల సమయానికి ఐదు, ఆరు సార్లు వర్షాలు పడడంతో పొలాలు నేలకు ఒరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీనికి తోడు చెరువులు, కుంటలు నిండుకుండలా ఉండడంతో జాలువారి నీరు నిల్వ ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వరి కోత యంత్రాలు వరి కోసే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. ఎకరం పొలం కోయడానికి రెండు గంటల సమయం పడుతోంది. దీంతో ఎకరానికి సుమారుగా రూ.15వేలు ఖర్చు చేయాల్సి వస్తుందంటున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం లేదంటున్నారు.

పెట్టుబడులు రాలేదు



ఈ సీజన్‌లో మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నేలకు ఒరిగింది. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. వరి కోయడానికి ట్రాక్‌మిషన్ల ధరలు అమాంతం పెంచారు. చేసేది లేక వాటితోనే వరి కోయిస్తున్నాం.

- తాళ్లపల్లి కంట్లం రైతు గోరెంట్ల గ్రామం, మద్దిరాల మండలం

తేమ ఆరదు.. ఇబ్బంది తీరదు..

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి): పంట పండించడం ఒక ఎత్తయితే దానిని విక్రయించడం రైతులకు మరింత కష్టంగా మారింది. వరుస వర్షాలతో తడిసిన ధాన్యాన్ని విక్రయించాలంటే తేమ శాతం అడ్డంకిగా మారింది. తేమ శాతం 17 ఉన్నప్పుడే గ్రేడ్-ఏ గుర్తించి ధాన్యానికి మద్దతు ధర కేటాయిస్తారు. ఇందుకోసం రైతులు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నానాతంటాలు పడుతున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్తున్న దారిలో ఆరబోసిన ధాన్యాన్ని చదును చేస్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. తేమతో సంబంధం లేకుండా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తే క్వింటాకు రూ.1800లు మాత్రమే చెల్లిస్తున్నారు. అంతేకాకుండా క్వింటాకు ఐదు కిలోలు తరుగు తీస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ధాన్యంలో తేమ పోవాలంటే కనీసం ఐదురోజులు ఆరబెట్టాలి. ఇందుకోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరబెట్టిన ధాన్యాన్ని చదును చేయాలి. సాయంత్రం ధాన్యాన్ని కుప్పగా చేసి టార్పాలిన్లు కప్పాలి. ఇందుకోసం కూలీలకు రూ.300 చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కూలీలతో పాటు ధాన్యం ఆరబెట్టేందుకు కావాల్సిన టార్పాలిన్లు ఇతర సామాగ్రి కలుపుకొని సుమారు రూ.5వేల వరకు అదనపు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

పశువుల్లో వ్యాధుల నియంత్రణకు టీకా

- 70శాతానికి చేరిన ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్
- ఆరు నెలలకోకసారి టీకాలు
- ప్రతీ పశువు వివరాలు 'భారత్ పశుధన్' యాప్‌లో నమోదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పాడి ఆవులు, పాడి గేదెల రక్షణతో పాటు ఇతర పశువుల్లో వ్యాధుల నివారణకు పశుసంవర్ధక శాఖ దృష్టిసారించింది. ప్రధానంగా పశువుల్లో కాళ్లవాపు వ్యాధి అంటే ఎఫ్ఎండీ (ఫుట్ అండ్ మౌత్ డిసీజెస్) రాకుండా ఉండేలా టీకాలను ప్రతీ ఆరు నెలలకోసారి వేస్తున్నారు. ఈ టీకాలతో పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. అందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)


పశువుల టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్

ఆవులు, గేదెలతో పాటు ఇతర పశువులను కాళ్లవ్యాధి నుంచి రక్షించడం టీకాల ముఖ్య ఉద్దేశం. ప్రతీ ఆరు నెలలకోసారి క్రమం తప్పకుండా ఈ టీకాలు వేస్తారు. గతనెల 15న ప్రారంభమైన టీకాల కార్యక్రమం ఈనెల 15వ తేదీతో ముగియనుంది. ఎఫ్ఎండీ వ్యాధులతో పాటు ఇతర వైరస్‌లను కూడా నియంత్రించేందుకు ఎఫ్ఎండీ టీకాలతో కలిపి ఇతర టీకాలు కూడా వేస్తారు.

పశువుల వివరాలు 'భారత్ పశుధన్' యాప్‌లో

పశువులకు టీకాలు వేయడంతోపాటు పశుసంపద వివరాలను 'భారత్ పశుధన్' యాప్‌లో అధికారులు నమోదు చేయనున్నారు. పశువుకు సంబంధించిన యజమాని, ఇతర వివరాలన్నింటినీ నమోదు చేస్తారు. పశువుకు టీకా ఇచ్చిన వెంటనే రైతు ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వెళ్తుంది. ఆ ఓటీపీ ఆధారంగా వివరాలు నమోదు చేస్తారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకా వచ్చినా ఆ వివరాలను యాప్‌లో నమోదుచేస్తారు. దీని ఆధారంగా ఎన్ని పశువులకు టీకా పూర్తయిందో తెలియనుంది. టీకా వేసిన 21 రోజుల తరువాత పశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎఫ్ఎండీ అంటువ్యాధి కావడంతో టీకా కార్యక్రమం ద్వారా ఇతర పశువులకు ఈ రోగం దరిచేరకుండా ఉంటుంది. అదేవిధంగా ప్రతీ పశువుకు ట్యాగ్ వేస్తారు. ఒకవేళ ట్యాగ్ ఊడినా, తిరిగి టీకాలు వేసే సమయంలో ట్యాగ్‌ను వేసి రికార్డుల్లో నమోదు చేస్తారు.

ప్రతీ పశువుకు టీకా వేయించాలి

గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలను ప్రతీ రైతు పశువులకు వేయించాలి. ఇప్పటికే 70శాతానికి పైగా టీకాల కార్యక్రమం పూర్తయింది. ఈనెల 15 వరకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తాం. ప్రతీ పశువుకు సంబంధించిన యజమాని వివరాలతో పాటు ఆ పశువుకు సంబంధించిన వివరాలన్నీ యాప్‌లో నమోదవుతాయి. ఎఫ్ఎండీ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రతీ ఆరు నెలలకోసారి టీకా కార్యక్రమం నిర్వహిస్తాం. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశుసంపదను కాపాడటం కోసం, పాడి ఉత్పత్తిని పెంచడం కోసం ప్రతీ ఒక్కరు సహకరించి ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

- రమేష్,పశుసంవర్ధకశాఖ జేడీ,నల్లగొండ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

సూర్యాపేటఅర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువజనోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు జానపద నృత్యాలు, పాటలు, ఉపన్యాసాలు, వ్యాస రచనలు, పోస్టర్ల తయారీ, పెయింటింగ్, కథలు, రచనలు వంటి నైపుణ్యాలను నేర్చుకుని సృజనాత్మకతను చాటాలన్నారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ యాదయ్య, విద్యార్థులు ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

భారత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా అదనపు జడ్జీ రాధాకృష్ణచౌహాన్



ర్యాలీలో పాల్గొన్నా జిల్లా అదనపు జడ్జీ రాధాకృష్ణ చౌహాన్

హుజూర్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):భారత చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు జడ్జీ రాధాకృష్ణ చౌహాన్ కోరారు. నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సత్వర న్యాయం పొందేందుకు ప్రతిఒక్కరూ ప్రయత్నించాలని, బాల్యవివాహాలను నిరోధించాలని,ఉచిత న్యాయసహాయం పొందాలని, అందరికీ సమన్యాయం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్, రేణుక, సుందర రాఘవరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తిగా రాధాకృష్ణ చౌహాన్



హుజూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జీగా పనిచేస్తున్న రాధాకృష్ణ చౌహాన్‌ను సూర్యాపేట జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేటి నుంచి జిల్లా అదనపు న్యాయమూర్తిగా పనిచేస్తూ హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా, పోక్సో కోర్టు న్యాయమూర్తిగా అదనపు పూర్తి బాధ్యతలను స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జీగా పనిచేస్తున్న చౌహాన్‌కు పదోన్నతి కల్పించడంతో పాటు స్థానిక రెండవ అదనపు న్యాయమూర్తిగా నియమించడంపై బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి సాముల రాంరెడ్డి, చెనగాని యాదగిరి, కాల్వ శ్రీనివాస్ ఇతర న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం

అదనపు కలెక్టర్ సీతారామారావు



సూర్యాపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో వందేమాతరం గీతం స్ఫూర్తి నింపి రణనినాదంగా ఉపయోగపడిందని అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు అన్నారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వందేమాతరం గీతం ఆలపించడం మనకు లభించిన మంచి అవకాశమన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం బెంగాల్ విభజన తర్వాత బాగా ప్రసిద్ధి చెందిందన్నారు. బెంగాలీ బాషలో రచించిన గేయం తెలుగులో భారతమాత నీకు వందనం, గలగల పారే ప్రవాహాలతో మలయ మారుతముల చల్లని గాలులతో సస్యశ్యామలమైన దేశమా నీకు వందనాలు అని దేశాన్ని కీర్తిస్తూ రచించారన్నారు. వందేమాతరం గీతం నేటికీ అఖండ భారత దేశంలో ప్రతి ఒక్కరి నోట పలుకుతుండడం మన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారులు నర్సింహారావు, శంకర్, నరసింహ, ఏవో సుదర్శన్‌రెడ్డి, సాయిగౌడ్, శ్రీలత, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యాం తదితరులు పాల్గొన్నారు.

పౌరులను ఏకతాటిపైకి నడిపిన గీతం: ఎస్పీ

సూర్యాపేట క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమంలో వందేమాతరం గీతం పౌరులను ఏకతాటిపైకి నడిపిందని ఎస్పీ కొత్తపల్లి నరసింహ అన్నారు. వందేమాతం గీతానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని 60 అడుగుల రోడ్డు నుంచి వాణిజ్యభవన్ సెంటరు వరకు విద్యార్థులతో కలిసి వందేమాతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, దేశ ఐకమత్యాన్ని, ఔన్నత్యాన్ని చాటాలని సూచించారు. భారతదేశం యొక్క స్థితిగతులు, దేశంలో ఉన్న పరిస్థితులు, ప్రజల అభిమతాన్ని తెలియజేస్తూ బంకించంద్ర చటర్జీ వందేమాతర గీతాన్ని రచించారన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో వందేమాతర గీతం ముఖ్య భూమిక పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్‌బీఐ రామారావు, వందేమాతర గీతాలాపన కమిటీ సభ్యులు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్, తోట శ్యాం, దశరథ, సృజన్‌కుమార్, ఉపేందర్, ప్రసన్న, ప్రసాద్, వెంకటరెడ్డి, శ్రీదేవి, హైమావతి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం నినాదం లేని ఉద్యమాన్ని ఊహించలేం

స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం నినాదం లేని ఉద్యమాన్ని ఊహించలేమని జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగరాణి అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థినులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మశ్రీ, రాణి, రజియా, జ్యోతి, విజయలక్ష్మి, సంధ్య, రుక్మా, ప్రమీల, యూన్సీ, ఫాతిమా. షహనాజ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

జిల్లా అడిషనల్ పీడీ ఎన్.శిరీష


ఉపాధి పనుల ప్రజావేదికలో మాట్లాడుతున్న అదనపు పీడీ శిరీష

మోతె, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని డీఆర్‌డీఏ అదనపు పీడీ శిరీష అన్నారు. 15విడత ఉపాధి పనుల వివరాలపై శుక్రవారం మోతె మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజల సమక్షంలో సామాజిక తనిఖీ బృందం ఏర్పాటుచేసిన ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అదనపు పీడీ శిరీష మాట్లాడారు. విధుల్లో ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది అలసత్వం వహించినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రూ.45వేలు రికవరీ చేసి, విధుల నుంచి తొలగిస్తామన్నారు. ప్రజా వేదికలో 29 గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను ఆడిట్ చేసిన సిబ్బంది చదివి వినిపించారు. లాల్ తండా, నామవరం, సిరికొండ, మోతె, కర్కాయలగూడెం గ్రామాల్లో చేపట్టిన పనులకు రికార్డుల్లో తేడాలు ఉన్నాయన్నారు. ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపతండ, సిరికొండ, తుమ్మలపల్లి గ్రామాల్లో పనుల కొలతల్లో తేడాలు గుర్తించి కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టీఏలకు కలిపి రూ.4.32 లక్షలు చేయడంతో పాటు రూ.61,500 జరిమానా విధించారు.

మద్యం మత్తులో భార్య హత్య

- తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కర్రతో దాడి
- మోతె మండలంలో ఘటన

మోతె, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య ఘర్షణ భార్య హత్యకు దారితీసింది. శుక్రవారం మోతె మండలం విభలాపురం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అజయ్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విభలాపురం గ్రామానికి చెందిన దంపతులు షేక్ బందెల్లి, కరీంబీ(45) సుతారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం బందెల్లి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంకా తాగడానికి డబ్బు కావాలని భార్యను అడగడంతో ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో ఇద్దరూ ఘర్షణ పడటంతో భర్త ఇంట్లో ఉన్న పెద్ద కర్రతో కరీంబీ తలపై బలంగా మోదాడు. తల పగిలి రక్తం కారుతున్న ఆమె కేకలు వేయడంతో, సమీపంలో ఉన్నవారు ఘటనా స్థలానికి చేరుకుని 108అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు.

ఆమెను అంబులెన్సులో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఎవరికి వారే బ్రాండ్

- నిబంధనలకు నీళ్లొదిలి పేరు ముద్రణ
- హోటళ్లు, వ్యక్తుల పేర దర్జాగా నీటి బాటిళ్ల విక్రయాలు



వాటర్ బాటిళ్లపై ఇష్టానుసారంగా లేబుళ్లు వేసి విక్రయిస్తున్నారు. హోటళ్లు, దాబాలతో పాటు వ్యాపార సంస్థల లేబుళ్లపై పేర్లు పెడుతూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు తమ బ్రాండ్‌గా బాటిళ్లపై లేబుళ్లు వేసేస్తున్నారు. వాటి తయారీ ప్రక్రియలోనూ పరిశుభ్రతను, బీఎస్ఐ ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో బ్రాండ్‌గా నమ్మి ప్రజలు తాగుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్లలో ముప్పావు వంతు అనుమతి లేనివి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

- వివరాలు 6లో

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా వేణుగోపాల్



హుజూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న వేణుగోపాల్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోకవర్గాలకు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా వేణుగోపాల్ విధులు నిర్వహించనున్నారు. ఆయన నియామకంపై పలువురు వైద్యాధికారుల, పారా మెడికల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సుజలాం, సుఫలాం వందేమాతరం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందేమాతరం గీతం మార్మోగింది. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసిన వందేమాతర గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన శుక్రవారం ప్రతీ మండలంలో వేడుకగా ఆలపించారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం యొక్క ప్రాముఖ్యాన్ని వక్తలు వివరించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు 150 ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. పలుచోట్ల రహదారులపై నిలబడి ఆలపించారు.



మునగాలలో రహదారిపై వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు





మేళ్లచెర్వు, నార్కట్‌పల్లి పాఠశాలల్లో 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



గుట్ట వైకుంఠద్వారం ఎదుట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపిస్తున్న పోలీస్ సిబ్బంది, విద్యార్థులు



నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో వందేమాతరం ఆలాపన





హాలియాలో జాతీయజెండాతో ఆలపిస్తున్న చిన్నారులు, మునుగోడు మండలం పులిపలుపుల రైతు వేదిక వద్ద నినాదాలు చేస్తున్న రైతులు



చింతపల్లి పీహెచ్‌సీ వద్ద వందేమాతరం ఆలపిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎవరికి వారే బ్రాండ్

- హోటళ్లు, వ్యక్తుల పేర దర్జాగా విక్రయాలు
- నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్‌ల నిర్వహణ

హోటళ్లు, ఇతర సంస్థల లేబుల్స్ వేస్తూ విచ్చలవిడిగా వాటర్ బాటిల్స్‌ను విక్రయిస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. అనుమతులు లేకుండా వాటర్‌ప్లాంట్స్ నిర్వహించడమే కాకుండా ఎలాంటి ప్రమాణాలు పాటించకుండానే వేల లీటర్ల నీటిని విక్రయిస్తున్నారు. ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిబంధనలకు విరుద్ధంగా లేబుళ్లు వేస్తూ వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్న ప్లాంట్‌ను సీజ్ చేశారు. వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో పరిశుభ్రమైన నీరు అని తాగేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

తాగునీటి కోసం ప్యూరీఫైడ్ నీటిపై అనేక మంది ఆధారపడుతున్నారు. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నా ప్రజలు ప్యూరీఫైడ్ నీటిపైనే తీసుకుంటున్నారు. దీంతో ప్రతీ గ్రామంలో కనీసం రెండు నుంచి నాలుగువరకు వాటర్‌ప్లాంట్లు నెల కొన్నాయి. నాసిరకం క్యాన్లు, పరిశుభ్రత పాటించకుండానే రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో 500కు పైగా వాటర్ ప్లాంట్స్ ఉన్నట్లు సమాచారం. కూల్‌వాటర్, మినరల్‌వాటర్ పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

నీటిని శుభ్రపరిచే యంత్రాలకు ప్రభుత్వపరంగా ఎటువంటి గుర్తింపు ఉండటంలేదు. క్యాన్లలోకి నీళ్లుపట్టే ముందు యూవీకెనాల్‌తో శుభ్రపర్చాలి. క్యాన్‌లను ప్రతిరోజూ పొటాషియం పర్మాంగనేట్ లేదా హైపో సొల్యూషన్‌తో శుభ్రం చేయాలి. ఆ తర్వాత శుభ్రం చేసిన తేదీని, బ్యాచ్ నెంబర్‌ను సీల్‌పై ముద్రించాలి. శానిటరీ అధికారులతో ప్రతి నెలా నీటిని పరీక్షింపజేసి బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) పంపించాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఏదీ జరగడం లేదు. వాటర్ ప్లాంట్‌లో వినియోగించే పైపులు, నిల్వ చేసే ట్యాంక్‌లు, స్టీలువి వినియోగించాల్సి ఉన్నా ప్లాస్టిక్ వాటిని వాడుతున్నారు. కొంత మంది మునిసిపల్ నీటిని క్యాన్‌ల్లో నింపి మినరల్ వాటర్‌గా విక్రయాలు చేస్తున్నా తనిఖీలు చేసేవారు కరువయ్యారు. 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను గ్రామాల్లో రూ.7 నుంచి రూ.10 దాకా విక్రయిస్తుండగా పట్టణంలో రూ.10 నుంచి రూ.15దాకా విక్రయిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్స్

సూర్యాపేట జిల్లాలో ప్యూరీఫైడ్ వాటర్‌ప్లాంట్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఐఎస్ఐ గుర్తింపు ఉందని పేర్కొనడం తప్ప అందుకు తగ్గ నిబంధనలు ఏవీ అనుసరించడం లేదు. ఇక అనధికార ప్లాంట్లు 400కి పైగానే ఉన్నట్లు సమాచారం. ఇంట్లో బోర్ వేయడం దానికి మోటార్ బిగించి ప్యూరీఫైడ్ వాటర్‌ప్లాంట్ పేరుతో నీటిని విక్రయిస్తున్నారు.జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ అందించే నీటిని తాగడానికి కాకుండా మిగతా అవసరాలకు వినియోగిస్తున్నారు. సూర్యాపేటలో 17 ప్లాంట్స్‌కు మాత్రమే అనుమతి ఉండగా అంతకు పదిరెట్లలో ప్లాంట్స్ ఉన్నాయి. జిల్లాలోని మిగతా మునిసిపాలిటీల్లోనూ ఇదే తీరున ప్లాంట్స్ వెలిశాయి. ఇదిలా ఉండగా ఐఎస్ఐ గుర్తింపు కోసం బీఐఎస్ అనుమతితో పాటు, లైసెన్సు ఫీజు రూ.99 వేలు చెల్లించాల్సి ఉంది. అంతేకాకుండా ప్రతి ఏడాదికోసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మునిసిపాలిటీకి ఏడాదికి చెల్లించాల్సిన రూ.1000 కూడా కొన్ని ప్లాంట్ల నిర్వాహకులు చెల్లించడంలేదని సమాచారం.



చౌటుప్పల్‌లోని ఓ ప్లాంట్‌లో అధికారులు సీజ్ చేసిన వివిధ లేబుళ్లతో ఉన్న వాటర్ బాటిళ్లు

నీళ్లు అవే.. పేర్లే మారుతాయ్

హోటల్, దాబా నిర్వాహకులు తమ వ్యాపారం లబ్ధికోసం ఎలాంటి అనుమతి లేకుండా వారి హోటల్స్, దాబా పేర్లను బాటిల్‌పై ముద్రిస్తున్నారు. సూర్యాపేటలో బిర్యానిసెంటర్లు, హోటళ్లు సుమారు 15వరకు ఉండగా వాటిల్లో 10కి పైగా హోటళ్లు తమ హోటల్ పేరుతో వాటర్‌బాటిళ్లను అందజేస్తున్నారు. వీరితో పాటు రాజకీయ నాయకులు తమపేరుతో కార్యకర్తలకు,ప్రజలకు బాటిళ్లు అందజేస్తున్నారు. నీళ్లు అవే కాగా, పేర్లు మాత్రం మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎక్కడో ఒక చోట దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

అనుమతి ఒక పేరుతో..

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ పరిధిలోని తాళ్లసింగారంలో ఒక వ్యక్తి వాటర్ బాటిళ్లు విక్రయించడానికి అనుమతి తీసుకున్నాడు. అయితే నిబంధనలకు విరుద్ధగా టీస్టాల్స్, హోటళ్ళు, దాబాల పేరుతో లేబుళ్లు ముద్రించి వాటర్‌బాటిల్స్ హోల్‌సేల్‌గా విక్రయించాడు. సమాచారం మేరకు అధికారులు, పోలీసులు వాటర్‌ప్లాంట్‌పై దాడి చేసి వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారు. వాటర్ బాటిల్ తయారుచేసే లేబుళ్ల టీడీఎస్ మిషన్లను, పీహెచ్‌సీ మిషన్లు, వివిధరకాల వాటర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేశారు. ఇది కేవలం అధికారుల దృష్టికి వచ్చిన వాటర్‌ప్లాంట్ కాగా వారి దృష్టికి రానివి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేకం ఉన్నాయి.

అనుమతులు లేని ప్లాంట్లపై చర్యలు

మునిసిపల్ అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్స్ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్లాంట్ నిర్వహణకు మునిసిపల్ నుంచి నోఅబ్జక్షన్ సర్టిఫికెట్ విధిగా పొందాలి. అంతేకాక ప్లాంట్ నిర్వహించాలంటే బీఎస్ఐ నిబంధనల ప్రకారం మైక్రోబయాలజిస్టు, కెమిస్ట్రి ఉండాలి. పరిశుద్ధమైన నీటినే వినియోగించాలి.

సీహెచ్ హన్మంతరెడ్డి, మునిసిపల్ కమిషనర్

ర్యాగింగ్‌తో జీవితాన్ని కోల్పోతారు




కళాశాలలో పర్యటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ

నల్లగొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ చేస్తే కళాశాల నుంచి బహిష్కరణకు గురికావడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదై విలువైన జీవితాన్ని కోల్పోతారని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు ప్రచారం నేపథ్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీవో అశోక్‌రెడ్డిలతో కలిసి వైద్యకళాశాలను కలెక్టర్ సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెచ్‌వోడీలు, అధ్యాపక బృందం, విద్యార్థి సంఘాల నాయకులు, మెంటర్లు, విద్యార్థులతో ఆమె విడివిడిగా చర్చించారు. మీడియాలో వచ్చిన వార్తల దృష్ట్యా నిజంగా వైద్యకళాశాలలో జరిగిన సంఘటనలను వివరించాలని ఆమె విద్యార్థులను అడిగారు. తమను ఎవరు ర్యాగింగ్ చేయ లేదని, స్నేహపూర్వక వాతావరణంలోనే తాము ఉన్నామని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, ఎవరైతే ర్యాగింగ్‌కు పాల్పడుతారో వారు చట్టరీత్యా తప్పుచేసిన వారవుతారన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఎక్కడైనా ర్యాగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్ రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి రికమండేషన్లు పనిచేయవని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నల్లగొండ ప్రభుత్వ వైదకళాశాలలో ర్యాగింగ్ జరిగినట్టు విద్యార్థుల నుంచి జిల్లా యంత్రాంగానికి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. విద్యార్థుల మాటల్లో సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకమైన వాతావరణంలోనే మెలిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తల్లిదండ్రులను బాధపెట్టకుండా వారి గురించి ఆలోచించాలని హితబోధ చేశారు. ర్యాగింగ్‌తో అందరికీ చెడ్డ పేరు వస్తుందన్నారు. వైద్య కళాశాల్లోని సీసీటీవీ ఫుటేజీలను సైతం పరిశీలిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఇకపై వైద్య కళాశాలను, విద్యార్థుల గదులను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు. తప్పుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థులు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు రావాలన్నారు. అధికారుల ఫోన్ నెంబర్లను విద్యార్థులకు తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

గరిడేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలలతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా హాలియా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ సమీపంలోని అంపాపూర్ పామాయిల్ ఫ్యాక్టరీకి పామాయిల్ గెలలతో లారీ వెళ్తోంది. అప్పన్నపేట గ్రామ శివారులోకి రాగానే లారీ అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే స్థానికులు లారీ క్యాబిన్ నుంచి డ్రైవర్‌ను బయటికితీశారు. డ్రైవర్ అస్గర్‌కు గాయాలు కాగా 108వాహనంలో హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై ఎస్ఐ నరేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



క్యాబిన్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

తలనొప్పిగా మారిన టెంకాయల విక్రయ వేలం



ఎల్లారెడ్డిగూడెంలో టెంకాయల విక్రయ వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థుల మధ్య కుదరని ఏకాభిప్రాయం, రాజకీయ ఆధిపత్య వివాదాలు వెరసి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో కొబ్బరికాయల విక్రయ వేలం నిర్వహణ అధికారులకు తలనొప్పిగా మారింది. మూడు పర్యాయాలు నిర్వహించిన టెంకాయల విక్రయ వేలం వేలాకోళంగా మారుతోందన్న విమర్శలు వినపడుతున్నాయి. ఫలితంగా ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆదాయానికి గండిపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధానమార్గం ఎల్లారెడ్డిగూడెం నుంచే ఉండటంతో భక్తుల ఇక్కడ బస్సులు దిగి వెళ్తుంటారు. దీంతో కొబ్బరికాయల విక్రయాలు ఏటేటా పెరుగుతూ రాగా గతంలోని పంచాయతీపాలకవర్గం ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొబ్బరికాయల విక్రయ వేలం హక్కుపొందే విధానాన్ని తీసుకువచ్చింది. దీంతో ఇది గ్రామపంచాయతీకి ఆదాయ వనరుగా మారింది.

గుడి కోసం రూ.10లక్షల కేటాయింపు

పంచాయతీ పరిధిలోని పురాతన పాదం గుడి నిర్మాణానికి గ్రామస్థులు సంకల్పించారు. ఇందుకు కావాల్సిన నిధులను విరాళంగా గ్రామపంచాయతీ టెంకాయల టెండర్ నిధుల సమయంలో రూ.10 లక్షలు చెల్లించాలని 2013 నుంచి 2018 వరకు ఉన్న పాలకవర్గం ఏకవాక్యంతో నిర్ణయించింది. దీంతో కొబ్బరికాయల విక్రయ వేలం హక్కు పొందాలనే ఆసక్తి ఉన్న వేలందారు రూ.10 లక్షలను పాదం గుడి అభివృద్ధికి అనధికారికంగా ఇచ్చేలా నిర్ణయించారు. ఆ మేరకు 2014 నుంచి 2017 వరకు మూడేళ్ల పాటు అనుకున్న ప్రకారం రూ.10 లక్షలను వేలందారులు చెల్లించగా గుడి నిర్మాణాన్ని చేపట్టారు. 2018-2023 వరకు కొనసాగిన పంచాయతీ పాలకవర్గం సమయంలో కరోనా రావడం అస్తవ్యస్థంగా మారింది. అప్పటి నుంచే పాదం గుడికి డబ్బులను కేటాయించే విధానానికి బ్రేకులు పడ్డాయి. కానీ ఈ కాలంలో పేరుకుపోయిన బకాయల వివాదం నేటికీ కొనసాగుతూనే ఉంది. కొబ్బరికాయల వేలం బకాయిల వివాదం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వివాదాలకు ఆజ్యం పోసింది.

రూ.10లక్షల కేటాయింపుపై మళ్లీ ప్రస్తావన?

ఇదిలా ఉంటే తాజాగా నిర్వహిస్తున్న కొబ్బరికాయల విక్రయ వేలం ద్వారా పాదంగుడికి రూ.10 లక్షలు కేటాయించాలనే డిమాండ్‌పై గ్రామస్థుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. గతంలో ఇచ్చిన డబ్బులకే లెక్క చూపలేదని కొందరు, బకాయిలు వసూలు చేయలేకపోయారని మరికొందరు వర్గాలుగా విడిపోయి విమర్శలకు దిగారు. ఫలితంగా టెండర్ నిర్వహణ కాలం ముగిసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా కొత్త టెండర్ వేయడంలో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. గత పాట కన్నా తక్కువ పాడితే నిబంధనలు అంగీకరించవు, ఎక్కువ పాడేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వంటి చిక్కుల మధ్య అధికారులు నలిగిపోతున్నారు.

నాలుగోసారి వాయిదా

ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఏడాది కాలపరిమితికి శుక్రవారం నిర్వహించిన టెంకాయల విక్రయ వేలం నాలుగోసారి వాయిదా పడింది. గతంలో మూడు పర్యాయాలు బహిరంగ వేలం నిర్వహించినా ప్రభుత్వ కనీస ధర పలకలేదు. దీంతో శుక్రవారం మరోసారి వేలం నిర్వహించారు. ఈ వేలం పాటకు మొత్తం 5 గురు వేలందారులు హాజరు కాగా ఎల్లారెడ్డిగూడెంనకు చెందిన చిక్కుళ్ల శివ అత్యధికంగా రూ.33,50,000లు మాత్రమే పాడారు. ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ వేలం పాటలో డీఎల్‌పీలో వెంకటేశ్వర్లు, పంచాయతీ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన ఇద్దరి రిమాండ్

చండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం తాగవద్దని అడ్డు చెప్పిన ఇద్దరి పోలీసులను ముగ్గురు యువకులు మద్యం మైకంలో చితకబాదారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మునిసిపాలిటీలో జరిగింది. ఎస్ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతున్న క్రమంలో మంగళవారం అర్ధరాత్రి చండూరులో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలోనే కారింగు క్రాంతికుమార్, మహ్మద్ సాజిద్‌బాబా, మహ్మద్ నాసర్‌పాషా బహిరంగంగా మద్యం తాగుతూ పోలీసుల కంట పడ్డారు. బహిరంగంగా మద్యం సేవించవద్దని, త్వరగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. కానీ అప్పటికే మద్యం మైకంలో ఉన్న యువకులు పోలీసులను తిడుతూ దాడికి పాల్పడటంతో పోలీసులకు స్వల్పగాయాలయ్యాయి. కానిస్టేబుల్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసి, ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

అనారోగ్యంతో వ్యాపారి ఆత్మహత్య



కృష్ణంరాజు(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపూస నొప్పితో బాధపడుతున్న ఓ ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ పరిధి తంగెడపల్లి గ్రామానికి చెందిన చీకూరి కృష్ణంరాజు(49) హైదరాబాద్‌లోని ఉడాసాయి నగర్‌లో నివాసం ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల నొప్పి ఎక్కువ కావడంతో నిద్రపట్టడం లేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కృష్ణంరాజు మండలంలోని దామెరలోని వ్యవసాయ క్షేత్రంలో క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి ఇంట్లో కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణంరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నూతనకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామశివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదనేమిల గ్రామానికి చెందిన కాసోజు మురళి(62) జంగం లాజర్ కలిసి పోలుమళ్ల గ్రామానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తుతెలియని వాహన ఢీకొనడంతో మురళి తలకు తీవ్రగాయాలు కాగా లాజర్‌కు చెయ్యి విరిగింది. ఇరువురిని 108 వాహనంలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మురళి మృతి చెందాడు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నరేష్ మూడు నెలల క్రితం రోడ్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి



స్థానిక సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కొండమల్లేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోలీసులతో ప్రజలతో మమేకం అవుతూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్‌డెస్క్, స్టేషన్‌రైటర్, ఎస్‌హెచ్‌వో గది, పోలీసులకు కేటాయించిన కిట్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. 100 డయల్‌కు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీ మౌనిక, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ రమేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

న్యాయమూర్తులకు బదిలీలు

మిర్యాలగూడ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జీ.వేణు, సీనియర్ సివిల్ జడ్జి బీ.సుజయ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న వేణు 6వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, సిటి సివిల్ కోర్టు సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. వేణు స్థానంలో ఖమ్మం జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ కేవీ.చంద్రశేఖర్‌రావు రానున్నారు. ఇదిలా ఉండగా సీనియర్ సివిల్ జడ్జి బత్తుల సుజయ్ 7వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సిటి సివిల్ కోర్టు హైద్రాబాద్‌కు పదోన్నతిపై వెళ్లనున్నారు. సుజయ్ రెండున్నర ఏళ్లుగా మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. సుజయ్ స్థానంలో జడ్జివెవరినీ నియమించలేదు.

పోక్సో కోర్టు న్యాయమూర్తిగా మిలింద్ కాంబ్లీ

భువనగిరి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పోక్సో(ఫాస్ట్ ట్రాక్ స్పెషల్) కోర్టు న్యాయమూర్తిగా మిలింద్ కాంబ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఆయన అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది భువనగిరి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు(పోక్సో)కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పోక్సో కోర్టుకు అదనపు జిల్లా ప్రధానన్యాయమూర్తి ముక్తిదా ఇన్‌చార్జి న్యాయమూర్తిగా వ్యవహరించారు.

కళా ఉత్సవ్.. సిరివెన్నెల సొంతం



కళా ఉత్సవ్ అవార్డు అందుకుంటున్న సిరివెన్నెల

మిర్యాలగూడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యార్థిని శ్రీపాద సిరివెన్నెల కళా ఉత్సవ్ అవార్డు అందుకుంది. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న సిరివెన్నెల నృత్య ప్రదర్శనతోపాటు డ్రాయింగ్ పోటీలలోనూ రాణిస్తోంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి డాన్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సిరివెన్నెలకు నిర్వాహకులు కళాఉత్సవ్ అవార్డు అందజేశారు. కాగా సిరివెన్నెల గురువు కలకొండ రాము, ఎంఈవోలు రామచంద్రయ్య, బాలు తదితరులు సిరివెన్నెలను అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక రేపు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల వాలీబాల్ ఎంపికలు సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సీనియర్ క్రీడాకారుల ఎంపికను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. వివరాలకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు సెల్:9494444870, సీతారాంరెడ్డి సంయుక్త కార్యదర్శి సెల్:9393044274ను సంప్రదించాలన్నారు.

తండ్రి వంట మనిషి..
కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు



నిహారిక

మఠంపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి నర్సింహారెడ్డి-నాగలక్ష్మి దంపతుల కుమార్తె నిహారిక వైద్య సీటు సాధించారు. తల్లి నాగలక్ష్మి చిన్నతనంలోనే మృతి చెందగా, తండ్రి నర్సింహారెడ్డి అన్నీ తానై పెంచి పెద్దచేశాడు. నర్సింహారెడ్డి ప్రైవేటు పరిశ్రమ కంపెనీలో వంట పనులు చేస్తూ తన కుమార్తెను చదివించారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో అర్హత సాధించి 375వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని ముషీరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



అండె లక్ష్మి, మర్రి లక్ష్మి

నల్లగొండ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని నర్సింగ్‌భట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4న కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో మర్రి లక్ష్మి, అండెం లక్ష్మి, అండర్-17 బాలికల విభాగంలో కానుగు హారిక ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.మారయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మల్లీశ్వరీ, ఫిజికల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నాగార్జునసాగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనీలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్ రెండోరోజు శుక్రవారం కొనసాగింది. రెండో రోజు పోటీల్లో 200 మీటర్ల పరుగు పందెంలో సాగర్ బీసీ గురుకులానికి చెందిన ఎం.గణేష్, ప్రథమ స్థానంలో నిలవగా 800 మీటర్ల పరుగు పందెంలో అనంతారానికి చెందిన బన్నీ ప్రథమ స్థానంలో నిలిచారు. డిస్కస్‌త్రోలో అనంతారంనుంచి అరవింద్ ప్రథమస్థానంలో నిలిచారు. ఖోఖో విభాగంలో అనంతారంపై నాగార్జునసాగర్ విజయం సాధించింది. కబడ్డీ విభాగంలో అనంతారం, కనగల్ సెమీస్‌కి చేరాయి. వాలీబాల్ విభాగంలో భూదాన్‌పోచంపల్లి, రాజాపేట జట్లు సెమీస్‌కి చేరాయి. శనివారం వాలీబాల్ విభాగంలో భూదాన్‌పోచంపల్లి, అనంతారం, కబడ్డీలో నేరేడుచర్ల, అనంతారం, ఖోఖోలో కేతేపల్లి, నాగార్జున సాగర్‌లు ఫైనల్‌లో తలపడనున్నట్లు ప్రిన్సిపల్ రవి కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ క్రీడా పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలో 16 బీసీ గురుకుల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

వేరుశనగ సాగుకు మొగ్గు



- దేవరకొండ డివిజన్‌లో యాసంగికి పెరుగనున్న సాగు
- జాతీయ పంట నూనెల మిషన్ పథకం అమలు
- కేంద్రం సబ్సిడీతో జిల్లాలోని ఎనిమిది మండలాలకు వేరుశనగ విత్తనాల సరఫరా

కేంద్రం అందిస్తున్న సాయంతో రైతులు వేరుశనగ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. జాతీయ పంట నూనెల మిషన్ పథకం అమలులో భాగంగా సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తుండడంతో, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనున్నారు. ఈ పథకం కింద జిల్లాలోని ఎనిమిది మండలాలకు వేరుశనగ విత్తనాలను సరఫరా చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

దేవరకొండ డివిజన్‌లో యాసంగికి వేరుశనగ పంట సాగు పెరుగనుంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ వంట నూనెల మిషన్ పథకాన్ని నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో అమలు చేస్తోంది. దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, తిరుమలగిరి(సాగర్), మునుగోడు, కట్టంగూరు మండలాల్లో యాసంగి సీజన్‌కు వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను ఇప్పటికే రైతులకు సరఫరాచేశారు. దీంతో రైతులు ఉత్సాహంగా యాసంగికి వేరుశనగ సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దేవరకొండ డివిజన్‌లోని దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లో ఇప్పటికే రైతులకు కేంద్రం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సరఫరాచేశారు.

యాసంగికి సిద్ధమవుతున్న రైతులు

యాసంగి సాగుకు వేరుశనగ పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దేవరకొండ మండలంలో 500 హెక్టార్లలో 1,125 క్వింటాళ్లు, డిండి మండలానికి 474.44 హెక్టార్లలో 1,067.49 క్వింటాళ్లు, చందంపేట మండలంలో 500 ఎకరాల్లో 1,125 క్వింటాళ్లు, నేరేడుగొమ్ము మండలంలో 500 హెక్టార్లలో 1,125 క్వింటాళ్లు, పీఏపల్లి మండలంలో 50 హెక్టార్లలో 112.5 క్వింటాళ్లు, మునుగోడు మండలంలో 40 హెక్టార్లలో 90 క్వింటాళ్లు, కట్టంగూరు మండలంలో 80 హెక్టార్లలో 180 క్వింటాళ్లు, తిరుమలగిరి(సాగర్) మండలంలో 80 హెక్టార్లలో 180 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలో 2,224.44 హెక్టార్లలో వేరుశనగ సాగు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వేరుశనగ పంట ఉత్పత్తులను పెంచేందుకు రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఉచితంగా సరఫరాచేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం నూనె గింజల సాగును పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వేరుశనగ సాగును ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈ సంవత్సరం దేవరకొండ డివిజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు లక్షా70వేల ఎకరాల్లో పత్తిపంట, 55వేల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. యాసంగి సీజన్‌లో డివిజన్‌లో 2వేల హెక్టార్లకు పైగా వేరుశనగ సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వేరుశనగ పంట లాభదాయకంగా ఉండడంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ విత్తనాలను తీసుకొని పంటలు వేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్ (ఫైల్)

సాగుకు సిద్ధమవుతున్నాం



యాసంగి సీజన్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ వేసేందుకు సిద్ధపడ్డాను. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసింది. దీంతో పెట్టుబడులు మిగిలాయి. వేరుశనగ పంట గతేడాది కూడా సాగుచేశాను. లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం.

రమావత్ నరియానాయక్, జగ్గుతండా, చందంపేట

రైతులకు ప్రోత్సాహం



కేంద్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందజేస్తుంది. దేవరకొండ డివిజన్‌లో దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశాం. రైతులు వేరుశనగ పంట సాగు చేసుకొని అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదగాలి. వ్యవసాయశాఖ రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ ప్రోత్సహిస్తుంది.

శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

స్వామియే శరణం అయ్యప్ప

- అయ్యప్ప మాలదారుల దీక్షలు ప్రారంభం
- జిల్లా అంతటా ఉట్టిపడుతున్న ఆధ్యాత్మికత

అయ్యప్ప నామస్మరణ మార్మోగుతోంది. జిల్లా అంతటా ఇప్పటికే భక్తులు దీక్షబూనారు. 41 రోజులపాటు ఎంతో నిష్ఠగా చేసే దీక్షలకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. అయ్యప్ప మాలధారులకు సుమారు రెండు నెలలపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో అయ్యప్ప స్వామి మాలధారుల దీక్షలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీ నుంచి అయ్యప్ప స్వామి దీక్షలు ముమ్మరమయ్యాయి. పట్టణంలోని దేవాలయంతోపాటు 20 సన్నిదానాల్లో 10 నుంచి 15 మంది అయ్యప్ప భక్తులు మండల దీక్షలను చేపట్టారు. దీక్షలను భక్తులు వచ్చే నెల 1వ తేదీ వరకు స్వీకరించే అవకాశం ఉంటుంది. 41 రోజులపాటు మాలధారులు తమ దీక్షలను కొనసాగించి శబరిమలైలోని అయ్యప్ప స్వామి దర్శనంతో ముగిస్తారు. సంక్రాంతి రోజున కనిపించే జ్యోతి దర్శనంతో స్వాములందరి దీక్షలు పరిసమాప్తమవుతాయి.

రెండు నెలలపాటు అన్నదానం

చౌటుప్పల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో 2001 నుంచి ప్రతీ సంవత్సరం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం నవంబరు 16వ తేదీ నుంచి వచ్చే జనవరి 12 తేదీ వరకు 58 రోజులపాటు మాలధారులకు మధ్యాహ్నం అన్నదానం చేస్తారు. మండలంలో సుమారు రెండువేల మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరిస్తున్నారు.

వచ్చే నెల వరకూ దీక్ష స్వీకరించవచ్చు



కార్తీక మాసం ప్రారంభంనుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు అయ్యప్ప మాలధారణ స్వీకరించవచ్చు. 41 రోజుల(మండల)దీక్షల అనంతరం శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో 36వసారి మాలధారణ చేస్తున్నా. దాతల సహకారంతో 2001 నుంచి అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రతీ ఏటా రెండు నెలల పాటు మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 12 వ తేదీ వరకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

బొబ్బిళ్ళ మురళి, అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, చౌటుప్పల్

మార్కెట్‌లో మట్టి మాయం

- అభివృద్ధి పేరుతో అక్రమ రవాణా



తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

మిర్యాలగూడ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌యార్డులో అభివృద్ధి పనుల పేరుతో అక్రమంగా మట్టిని తరలించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ అవంతీపురంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. అందులో మూడు ఎకరాలు గుట్ట ఉండడంతో పశువుల సంత నిర్వహణ, గోదాముల నిర్మాణానికి అడ్డంకిగా మారిందని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గుట్ట తొలగింపు కోసం బడ్జెట్ కేటాయించే పరిస్థితులు లేవని పేర్కొనడంతో ప్రైవేట్ వ్యక్తుల అవసరాలకు మట్టిని తరలించేందుకు నాయకుల అండదండలతో మట్టి అక్రమ రవాణా సాగించినట్లు ఆరోపణలున్నాయి. దీన్ని గుర్తించిన స్థానికులు జిల్లా అధికారులకు సమాచారం అందించడంతో మైనింగ్ శాఖ అధికారులు మార్కెట్‌యార్డును పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపడుతున్న తవ్వకాలను నిలిపివేసి జరిమానా విధించారు. మార్కెట్‌యార్డులో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యాజమాన్యాలకు కాస్త ఊరట

- కళాశాలలకు రూ.900కోట్ల రీయింబర్స్‌మెంట్ విడుదలకు ప్రభుత్వం అంగీకారం
- సమ్మె విరమించిన ప్రైవేట్ యాజమాన్యాలు

భువనగిరి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో కొంత ఉపశమనం కలిగినట్లయింది. రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.10వేల కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ యాజమాన్యాలు ఐదు రోజులుగా సమ్మె చేపట్టిన విషయం విధితమే. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో యాజమాన్యాల ప్రతినిధులు జరిపిన చర్చలలో రూ.900కోట్ల విడుదలకు అంగీకారం కుదిరింది. దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు యాజమాన్యాల అసోసియేషన్ ప్రకటించింది. దీంతో జిల్లాలోని ప్రైవేట్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఫార్మా, డైట్, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, న్యాయ తదితర ఉన్నత విద్యా, వృత్తి విద్యా కళాశాలలు నేటినుంచి తెరుచుకోనున్నాయి. కాగా జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.300కోట్లు రావాల్సి ఉండగా, ప్రభుత్వమిచ్చిన హామీ మేరకు ఎంత వరకు న్యాయం జరుగుతుందోనని యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. అయితే సమ్మె కారణంగా వాయిదాపడిన ఫార్మా కోర్సుల పరీక్షలు, ఈ నెల 13 నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై త్వరలో స్పష్టత రానుంది.

యాదగిరీశుడికి సువర్ణ పుష్పార్చన

- ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాలు



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 21,44,808 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడలో మండపాల్లో 486 దంపతులు సత్యదేవుడి వ్రతాలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాన్ని పరిశీలించిన ఈవో



దుకాణాలను పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఈవో ఎస్. వెంకట్రావు పరిశీలనలు చేపట్టారు. యాదగిరి కొండపై ఈవో శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం క్యూలైన్లు, ఉచిత ప్రసాద వితరణ, ప్రసాద కౌంటర్లు, శివాలయం, దుకాణాల సముదాయాలు పరిశీలించారు. ఆయనవెంట ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి క్రిష్ణ, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, నాగుల మహేష్‌గౌడ్, జటావత్ శంకర్‌నాయక్, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాదగిరీశుడి చెంత వందేమాతరం జాతీయ గీతాలాపన చేశారు.

మట్టపల్లివాసుడి గరుడోత్సవం



మఠంపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో శుక్రవారం రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతీమాసం మట్టపల్లి లక్ష్మీనరసింహుడికి స్వాతీనక్షత్ర శుభఘడియల్లో నిర్వహించే కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ పాల్గొన్నారు. అంతకుముందు కృష్ణమ్మకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశిష్ట సేవలకు.. ప్రతిష్టాత్మక పురస్కారం

- భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబుకు 'కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్' పురస్కారం
- అభినందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

విధుల్లో అంకితభావం.. పనిపట్ల నిబద్ధతకు పురస్కారం లభించింది. నేరాల అదుపుతోపాటు సంబంధిత కేసుల్లో విచారణను వేగవంతం చేసి, పరిష్కారానికి కృషి చేసినందుకు కేంద్రం అభినందించి, పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ అవార్డు దక్కడం హర్షనీయమని రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)



చంద్రబాబు



చంద్రబాబును అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భువనగిరి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నగరి చంద్రబాబు ప్రతిష్టాత్మక పురస్కారం కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్‌కు ఎంపికయ్యారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఈయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ప్రొబెషనరీ ఎస్‌ఐగా ఉద్యోగ బాధ్యతలు ఆరంభించారు. అనంతరం మొదటి పోస్టింగ్ నల్లగొండ జిల్లా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో సివిల్ ఎస్‌ఐ. 2012లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అప్పటినుంచి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాపరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ క్రైం ఇన్వెస్టిగేషన్ (నేర దర్యాప్తు పరిశోధన)లో చురుకుగా వ్యవహరిస్తూ పలు కేసులనుఛేదించారు. ఘట్కేసర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై భువనగిరి రూరల్ సీఐగా ఇక్కడికి వచ్చారు. కాగా క్రైం ఇన్వెస్టిగేషన్‌లో అంతర్భాగమైన కేసుల పరిశోధనలో ప్రతిభ కనబరిచినందుకు ఈ నెల 3న కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్ పురస్కారానికి ఎంపిక చేశారు.

అవార్డు ఎంపికలో కీలకమైన నాలుగు విభాగాలు

దేశంలో అన్ని రాష్ట్రాల పోలీసుల్లో విశిష్ట సేవలు అందించినందుకు ఈ అవార్డును అందజేస్తారు. కేంద్రీయ గృహ మంత్రి దక్షిత్ పతక్ పురస్కారాల్లో నాలుగు విభాగాలుంటాయి. ఇందులో స్పెషల్ ఆపరేషన్, క్రైం ఇన్వెస్టిగేషన్, ఇంటలిజెన్స్, ఫోరెన్సిక్ సైన్స్‌లలో ప్రతిభ కనబరిచిన వారికి మినస్టరీ ఆఫ్ సెంట్రల్ హోం అఫైర్స్ వారు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అవార్డులను ప్రకటిస్తారు. అయితే పై నాలుగు అవార్డులను కలిపి 2024 ఫిబ్రవరినుంచి ఒకే అవార్డుగా అందజేస్తున్నారు. ఈ సంవత్సరం విధి నిర్వహణలో అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఐజీ స్థాయి అధికారి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు మొత్తం 1,466 మంది పోలీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. రాష్ట్రంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధినుంచి ఎంపికైన వారిలో భువనగిరి రూరల్ సీఐ నగరి చంద్రబాబు ఉండడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. అయితే 2026 జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాల నుంచి పురస్కారం అందుకోనున్నారు.

మరిన్ని అవార్డులు అందుకోవాలి
సీపీ సుధీర్ బాబు

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భువనగిరి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రబాబుకు అవార్డు ప్రకటించడంపై రాచకొండ సీపీ సుధీర్ బాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఆయన అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ చాటి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని కాంక్షించారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

మునగాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ పాటించడంతో పాటు క్రమ శిక్షణ నేర్పాలని ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల వసతి గహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులకు పెట్టిన భోజనం, కూరగాయలు, బియ్యం పరిశీలించారు. విద్యార్థినులతో కలసి భోజనం చేసి, మెనూ సక్రమంగా పాటిస్తున్నారా? లేదా? అని తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట టౌన్-2లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ యశ్వంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఇందిరమ్మకాలనీ 1వ విడత, ఎన్టీఆర్ కాలనీ, సైనిక్‌పురి కాలనీ, సీతారాంపురం, నాగులమ్మగుడి, మామిళ్లగడ్డ, రెడ్డిహాస్టల్, కస్తూరిబజార్, ప్రియాంక కాలనీ, ఏరియా ఆసుపత్రి వెనుకాల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దేశభక్తి పెంపొందించిన వందేమాతర గీతం

వందేమాతర గీతం ఆలాపాన ప్రజల్లో దేశభక్తి పెంపొంచిందిందని పలువురు కొనియాడారు. జాతీయ గీతాన్ని బకించంద్ర చటర్జీ రచించి 150సంవత్సరాలైన సందర్భంగా శుక్రవారం జిల్లా వాప్తంగా ర్యాలీలు నిర్వ హించ డంతో పాటు జాతీయ గీతాన్ని ఆలపించారు.


చిలుకూరు బస్టాండ్‌లో సాముహిక గీతాలాపన చేస్తున్న ఉద్యోగులు

సూర్యాపేట నియోజకవర్గంలో..

●పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ కార్యాలయాల్లో అధికారులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానయ్య, తహసీల్దార్ లాల్ నాయక్, ఎస్‌ఐ గోపికృష్ణ, ఏపీవో రవి, ఈసీ ఏకస్వామి, మహేష్, బుచ్చన్న, అనూష, రవి కుమార్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..

● హుజూర్‌నగర్: దేశసమగ్రతను కాపాడాలని ఎస్‌ఐ బండి మోహన్ బాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపించి అనంతరం ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు వెంకన్న, శ్రీనివాస్, బలరాంరెడ్డి, గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

●నేరేడుచర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఆలాపన కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్, హెచ్‌ఎం బట్టు మధు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, వీరవల్లి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

●మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థునులు 150 సంఖ్య ఆకారంలో నిలబడి వందేమాతరం గీతం పాడి గౌరవాన్ని చాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం హరిత మాట్లాడుతూ పాఠశాలలో ఈ నెల ఏడో తేదీ వరకు వేడుక నిర్వహిస్తామన్నారు.

● చింతలపాలెం: మండల కేంద్రంలో ఎస్‌ఐ ఎన్.సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నారపరాజు శ్రీనివాస్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, ఉషోదయ స్కూల్ కరస్పాండెంట్ చింత్రియాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ నియోజకవర్గంలో..

● మునగాల: ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాల్, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో నరేష్, ఏపీవో శైలజ,ప్రిన్సిపాల్ సైదయ్యగౌడ్ పాల్గొన్నారు.

● చిలుకూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి సాముహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో ముక్కపాటి నర్సింహారావు, ఎస్‌ఐ సురేష్‌రెడ్డి, హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.



హుజూర్‌గర్‌లో పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థినీ విద్యార్థులు

● అనంతగిరి: మండల కేంద్రంలోని శివాలయం సెంటరులో పోలీసుల ఆధ్వర్యంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


తుంగతుర్తిలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, పోలీసులు

తుంగతుర్తి నియోజకవర్గంలో..

●తుంగతుర్తి: నియోజకవర్గ కేంద్రంలో పోలీసులు విద్యార్థు లతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేబూని వందేమాతరం గేయం ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎస్‌ఐ క్రాంతికుమార్, ఏపీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

● అర్వపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సైదులు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఝాన్సీ, పీహెచ్‌సీలో సీహెచ్‌వో బుచ్చునాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలపించారు.

● మద్దిరాల: వందేమాతరం గీతాలాపనలో తహసీల్దార్ అయేషాపర్వీనా, ఎస్‌ఐ వీరన్న, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

● తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్: మునిసిపల్ కేంద్రంలోని మునిసిపల్, తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ స్టేషన్‌లో సిబ్బంది వందేమాతరం గీతాలాపన చేశారు. జడ్పీహెచ్‌ఎస్, మోడల్ స్కూల్ విద్యార్థులు తిరుమలగిరిలో భారీ ర్యాలీ నిర్వహించి గీతాన్ని ఆలపించారు. తాటిపాముల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సంబురాల్లో ఎంపీడీవో లాజర్, ఎంఈవో శాంతయ్య, హెచ్‌ఎం శ్రీనివాసులు, పాల్గొన్నారు.

● నూతనకల్: మండల కేంద్రంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతర గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, ఎస్‌ఐ నాగరాజు, ఎంఈవో రాములునాయక్, ఏపీఎం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరకొర వసతులతో ప్రభుత్వ ఆసుపత్రులు

మునగాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అరకొర వసతుల నడుమ పీహెచ్‌సీలు కొనసాగుతున్నాయని వ్యకా.స జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలోని పీహెచ్‌సీని వ్యకా.స ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. . మునగాలలో కోట్ల వ్యయంతో భవనం నిర్మించి సరిపడా లేదనందున వైద్యానికి రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేడు శ్రీవెంకటేశ్వరాలయం ప్రారంభం

పెన్‌పహాడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరాలయాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు దేవాలయం ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం ప్రతిష్ఠ మహోత్సవానికి శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి హాజరు కానున్నారు.

రెండో రోజు కొనసాగిన వైద్య పరీక్షలు

మేళ్లచెర్వు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆరెంజ్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం రెండో రోజు కామెర్ల నిర్ధారణ పరీక్షలను కొనసాగించారు. జిల్లా సర్వేలైన్స్ అధికారి శ్రీశైలం పర్యవేక్షణలో 250 మంది విద్యార్థినీవిద్యార్థుల రక్త నమునాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సతీష్, నిఖిల్, వినయ్, అఖిల్, అఖిల లక్ష్మీప్రసన్న, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీకి మిత్రుల ఆర్థికసాయం

చిలుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ సిద్దిక్ ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. దీంతో శుక్రవారం మండలంలోని సహచర ఆర్‌ఎంపీ వైద్యులు రూ.22వేల ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు భుజంగరావు, ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్, వెంకటప్పయ్య, తురక ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కొటిరెడ్డి, శ్రీనివాస్, షేక్ గౌస్, పరశురాములు, రమణ, రాజు, బాబు, మున్నా, విజయ్ పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

మేళ్లచెర్వు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమ పరిసర గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మైహోమ్ ప్లాంట్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సి బిటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకటరామాపురం గ్రామంలో రూ.7లక్షలతో ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థల దాత బేతరామ్‌రెడ్డి, సంస్థ జీఎం శ్రీరామ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

మద్దిరాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేపాక లింగయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో డీటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. మండల అధ్యక్షుడిగా జి.రాములు, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, శిల్ప, కార్యదర్శులుగా శివప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా లింగయ్య, శ్రీదేవి, మధు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా షరీఫ్, సభ్యులుగా అవిలయ్య, సురేష్, సెల్ కన్వీనర్‌గా అలీముద్దీన్, సెల్ సభ్యులుగా శిరీష, గోవింద్‌ను ఎన్నుకున్నామన్నారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అందించే పురస్కారాలకు అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులతో పాటు దివ్యాంగుల సాధికారిత కోసం పని చేస్తున్న సంస్థలు, దివ్యాంగుల ప్లేస్‌మెంట్ ఏజెన్సీలు ఈ నెల 15వ తేదీలోపు కలెక్టరేట్‌లోని మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దేవాలయంలో ద్వారోద్ఘాటన

మద్దిరాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిననెమిల గ్రామంలో సీతారామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ద్వారోద్ఘాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా నమఃశివాయ నామస్మరణతోమార్మోగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయకమిటీసభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నాగారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎల్మకంటి వెంక టేష్‌కు రూ.40లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును వెంకటేష్‌కు కాంగ్రెసు నాయకుడు జాజుల వీరయ్య శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకలు దేవరకొండ మల్లయ్య, కన్నెబోయిన అంజయ్య, కొండం వెంకటేశ్వర్లు, పడిశాల నాగేష్. అనంతోజు రవి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కొనసాగుతున్న క్రీడలు

తుంగతుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో జోనల్ స్పోర్ట్స్ నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో కబడ్డీ, ఖోఖో , వాలీబాల్ తదితర ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి అరుణకుమారి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో అన్నదానం

కోదాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోదాడ పట్టణంలోని బాలాజీనగర్ అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప స్వాములు, భక్తులకు, దేవాలయ కమిటీ సభ్యులు, దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి చల్లా రామ్మూర్తి, కమిటీ సభ్యులు కొక్కు లక్ష్మీనారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, సురభి నరసయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, వంకాయలపాటి నాగేశ్వరరావు, బారిష సత్యం, సోమేశ్వరరావు, సైదులు, రామనాథం పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆసంఘ జిల్లా కార్యదర్శి కొండా కోటయ్య, పాలకూరి బాబు కోరారు. శుక్రవారం పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. చనిపోయిన గీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలన్నారు. కార్పొరేషన్‌కు రూ.5 కోట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సోమగాని రామన్న, సత్యనారాయణ, లింగయ్య, చిన్న,పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

పెన్‌పహాడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో శ్రీ రాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షయ రోగులకు పౌష్టికాహార పౌష్టికాహారం కిట్లను టస్ట్ చైర్మన్ నెమ్మాది సంజీవయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వాలంటీర్ బాణోతు రోహిత్, స్వాతి, తాడూరి వెంకన్న, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎం విద్యార్థుల క్షేత్ర పర్యటన


మునిసిపల్ కార్మికులకు దుస్తులు అందజేస్తున్న విద్యార్థులు

కోదాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటనలో భాగంగా కోదాడ ఎస్‌ఆర్‌ఎం విద్యార్థులు మునిసిపల్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత, దానిలో విద్యార్థులు పాత్ర అంశాన్ని మునిసిపల్ కమిషనర్‌ని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు శ్రమదానం చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు తాము పొదుపు చేసుకున్న నగదుతో దుస్తులు కొనుగోలు చేసి మునిసిపల్ కార్మికులకు అందజేశారో కొందరు విద్యార్థులు ఏపీ రాజధాని అమరావతి వెళ్లి మహిళ భారత క్రికెట్ జట్టులో సభ్యురాలైన ఎస్.శ్రీచరణిని కలిశారు. వరల్డ్‌కప్ సాధించినందుకు అమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ తమ విద్యార్థులు సామాజిక చైతన్యంలో భాగస్వామ్యం కావటం అభినందనీయమన్నారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

కన్నీరే మిగిలింది

(5వ పేజీ తరువాయి)

వర్షానికి తడిసి రంగు మారడంతో పాటు పత్తి చేన్లు వరద నీటిలో మునిగి మురిగిపోయాయి. ప్రస్తుతం రైతులకు కూలీలకు, ఎరువులకు, సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేదు.

ఎనిమిది ఎకరాల పొలం మునిగింది

ఎనిమిది ఎకరాలు మర్రికుంట కింద మునిగిపోయింది. ఎకరానికి ఇప్పటికే రూ. 30వేలు ఖర్చు చేశా. కుంట కింద పొలం కావడంతో నీరు చేరింది. ఈ ఏడాది పలుమార్లు భారీ వర్షాలు కురవడంతో కుంట అలుగుబోసి పొలంలోకి నీరు చేరింది. పంట చేతికి వచ్చే సమయంలో పొలంలో నీరు చేరడంతో పంట నష్టం జరిగింది. ఎకరానికి రూ. 25వేలునష్ట పరిహారం అందించాలి.

● గోపాల్‌రెడ్డి, ఆత్మకూరు(ఎస్)

ఎకరం పొలం మునిగింది



వరద ప్రవాహంలో పంట పూర్తిగా మునిగింది. వరద ప్రవాహంలో పొలం మొత్తం కొట్టుకుపోయింది. ఎకరానికి రూ. 25వేలు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం పెట్టుబడి రాకపోగా అప్పులు అయ్యాయి. ప్రభుత్వం కనీసం రూ.30వేలు పంట నష్టపరిహారం అందించాలి.

● అంజయ్య, ఆత్మకూరు(ఎస్)

పంట నష్టంపై సర్వే చేస్తున్నాం



జిల్లాలో వర్షాలతో జరిగిన పంట నష్టంపై సర్వే చేస్తున్నాం. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. ప్రాథమిక అంచనాగా వరి 54 వేల ఎకరాల్లో, పత్తి 10వేల ఎకరాల్లో నష్టపోయినట్లు తెలిసింది. పూర్తి సర్వే అనంతరం వివరాలు ప్రభుత్వానికి అందజేస్తాం.

● శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రతిభను గుర్తించేందుకు ‘చెకుముకి’ పరీక్షలు

కోదాడ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభ కనబర్చేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఎంఈవో సలీంషరీఫ్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల చెకుముకి సైన్స్ పరీక్ష పత్రాలను విడుదల చేసి మాట్లాడారు. పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థి ఎస్‌కే తాయబ్, 9వ తరగతి విద్యార్థి టి.హర్షకుమార్, 8వ తరగతి విద్యార్థి కె.షణ్ముఖ మండల స్థాయికి ఎంపికైన పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఈ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సైదులు, ఎం.జానకిరామ్, హెచ్‌ఎం లింగయ్య, పాండురంగచారి, ఖాజామియా, వేణుకుమార్, చిన్నప్ప, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


చెకుముకి పరీక్ష పత్రాలను విడుదల చేసిన ఎంఈవో సలీంషరీఫ్

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

సూర్యాపేటటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రజలంతా సహకరించాలని మునిసిపల్ కమీషనర్ సీహెచ్. హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 10వార్డులో పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కార్యక్రమంలో పాల్గొని శ్రమధానం నిర్వహించి మాట్లాడారు. పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పట్టణాన్ని చెత్తరహిత పట్టణంగా మార్చడంలో బాగస్వాములు కావాలన్నారు. శ్రమధానం కేవలం ఒక కార్యక్రమం కాదని అది స్వచ్ఛ సూర్యాపేట లక్ష్యానికి మొదటి అడుగు అన్నారు. ఆసందర్భంగ ప్రజలు, అదికారులు రహదారి పక్కను ఉన్న చెత్తను, కలుపు మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టూన్‌ప్లాన్ అదికారులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

హుజూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని డీబీ స్కూల్ చైర్మన్ గెల్లి రవి కోరారు. శుక్రవారం జిల్లా స్థాయి కోకో పోటీల్లో మొదటి బహుమతి సాధించిన డీబీ స్కూల్ విద్యార్థి సంగీతను అభినందిచారు. జిల్లా నుంచి గెలుపొంది ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట స్థాయిలో ప్రతిభ కనబర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేవీ ప్రసాద్, నాగునాయక్, సరిత, కవిత, సౌజన్య , నాగేశ్వరి, బాష, విజయలక్ష్మి, కరిష్మా, కుమారి, అనురాధ పాల్గొన్నారు.

క్రికెటర్ శ్రీచరణిని కలిసిన విద్యార్థులు

హుజూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కప్‌లో భారత్ జట్టు సభ్యురాలైన క్రికెటర్ శ్రీచరణి,మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌ని హుజూర్‌నగర్ కు చెందిన ఎస్‌ఆర్‌ఎం విద్యార్థులు శుక్రవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా శ్రీచరణిని పూలమాలలు, శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, స్వాషిన్ రాథోడ్ కతిక సాయి, నిధిత, సిరిచందన , దిక్షివిత, అవంతిక, లక్ష్మీదీక్షిత పాల్గొన్నారు.

స్పార్క్ ఫెస్టు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో నల్లగొండలో ఈ నెల 6న నిర్వహించిన ఈ స్పార్క్ ఫెస్టు ఉర్దూ వ్యాసరచన పోటీల్లో హుజూర్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులుసయ్యద్ అంజుమ్, హ్యాడ్ బాల్ క్రీడాల్లో నూకపంగు ఆకాంక్ష ప్రతిభ చాటారు. కాగా ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రతిభ కనపర్చించిన ఆ విద్యార్థులు రాష్ట పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రెహానా బేగం తెలిపారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకే ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఆత్మకూర్(ఎస్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ కోరారు. శుక్రవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో ఏపూర్ జడ్పీహెచ్‌ఎస్, జ్యోతిబాపూలే పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ఏపూర్ పాఠశాలలో ఆహార పదార్థాలను భద్రపర్చడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా చూసుకోవాలని సూచించారు. ఈ ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రదీప్‌రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

11న గుర్రప్ప జాతర

కోదాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగర్రాయి గ్రామంలో శ్రీగురునాథ గుర్రప్పస్వామి మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 11న జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అఖండ స్థాపన, దీపారాధన, రుద్రాభిషేకం, గణపతి రుద్రహోమం, పొంగళ్ళు, పూర్ణాహుతి కార్యక్రమాలు కొంకపాక సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.. పూజా కార్యక్రమాల అనంతరం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూజ, అభిషేకాల్లో పాల్గొనే వారు తప్పనిసరిగా పట్టువస్త్రాలు ధరించాలని సూచించారు.

అమరవీరుల ఆశయాలు సాధించాలి

సూర్యాపేటఅర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను సాధించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం రోడ్డులో జనార్దన్ విగ్రహం ఎదుట పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లో పాల్గొనాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక,అఖిల్‌కుమార్, నాగయ్య, నర్సయ్య, చంద్రకళ, సంతోషిమాత, పద్మ, కల్పన, శేషగిరి, సత్తిరెడ్డి, మల్లారెడ్డి, బాలస్వామి, జలేందర్ పాల్గొన్నారు.

రహదారుల పనులు ప్రారంభం

నూతనకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో 365 జాతీయ రహదారి పునర్నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగాల రామచంద్రయ్య మాట్లాడుతూ ఎర్రపహాడ్, దిర్శనపల్లి, పెదనెమిల గ్రామాల రోడ్లూ పూర్తిగా ధ్వంసమై బస్సులు రానందున ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే రహదారుల పనులు జరిగే విదంగా చర్యలు తీసుకున్నారన్నారు. పనులు ప్రారంభించడంపై గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీని ప్రకటించాలి

నాగారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏ, నూతన పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రబాధ్యులు రాచూరి ప్రతాప్, మండల శాఖ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, జిల్లా కౌనిల్సర్ సీహెచ్ రవి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

సూర్యాపేట టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలచేయనందున ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయని, దీంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, సత్యం, కొమర్రాజు, వెంకట్, కోటయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యం

గరిడేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కోదాడ, మిర్యాలగూడెం జాతీయ రహదారి 167పై బ్యారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేగం నియంత్రణకు బ్యారీకేడ్లు ఉపయోగపడతాయన్నారు. ట్రాఫిక్ నిబంధలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం రాయినిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చలికంటి నరేష్, గుండు రామాంజి, కడప దేవదానం, బాల్దూరి సందీప్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రవీందర్, యువకులు పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవించాలి

సూర్యాపేట అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థలు అన్ని మతాలను గౌరవించాలని తెలంగాణ స్టూడెంట్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలో ఏపీఎం పాఠశాల ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. జనగణమన, వందేమాతరం గేయాలను ప్రార్థన సమయంలో విద్యార్థులతో పాడించాలన్నారు. అయప్ప మాల ధరించిన విద్యార్థిని ప్రిన్సిపాల్ దండించిన వ్యవహారంలో పట్టణంలో ఏపీఎం పాఠశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడిపల్లి సాయితేజ, నిఖిల్, సాయి, యశ్వంత్, మణి, వేణు, నరేష్, రాజు, రవి, పవన్‌పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయాలి

పెన్‌పహాడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆ సంఘం సభ్యులతో కలిసి పీహెచ్‌సీ ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది సంఖ్య పెంచాలన్నారు. పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కొండమీది రాములు, రణపంగ కృష్ణ, గుర్రం గోపాల్ రెడ్డి, రణపంగ బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో సైదానాయక్ కోరారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి పోటీల ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. శాస్త్రీయ విలువలు జ్ఞానాన్ని పెంచుకొని సమాజంలో సమూల మార్పులకు సారథులు కావాలన్నారు.విద్యార్థులు మంచి నడవడికతో ఉంటే చదువు బాగా వస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెహబుబ్ జాని, వేముల శ్రీనివాస్, వెంకటయ్య , సీఆర్పీ కలకుంట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.